సాక్షి
పల్నాడు
శుక్రవారం | 11 | జూలై | 2025



అష్టలక్ష్మి అమ్మవారికి సారె సమర్పణ

నరసరావుపేట ఈస్ట్: ఆషాఢ మాసం నేపథ్యంలో ఎన్జీఓ కాలనీలోని శ్రీ అష్టలక్ష్మి అమ్మవారికి గురువారం మహిళలు ఊరేగింపుగా వచ్చి సారె సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు.



పోలేరమ్మకు కూరగాయల అలంకరణ

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం వాల్మీకినగర్‌లోని గ్రామ దేవత శ్రీపోలేరమ్మ గురువారం శాకంబరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

ఆదికేశవ స్వామికి గరుడ సేవ



చేబ్రోలు: స్థానిక శ్రీ భూనీలా సమేత ఆది కేశవ స్వామి వారి ఆలయంలో గురువారం రాత్రి పున్నమి గరుడ సేవ ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

శాకంబరిగా బాల చాముండేశ్వరి



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం బాల చాముండేశ్వరి దేవి భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారిని కూరగాయలతో ఆకర్షణీయంగా అలంకరించారు. లోక కల్యాణార్థం అమ్మవారిని కూరగాయలతో అలంకరించామని ఆలయ స్థానాచార్యుడు చంద్రశేఖర శర్మ తెలిపారు. ఆలయంలోని జ్వాలాముఖి దేవికి కూడా శాకంబరిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

పెరుగుతున్న సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జునసాగర్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రం ఆరు గంటలకు 541.20 అడుగులకు చేరింది. కాగా, ఇది 190.8366 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 4,204, ఎడమ కాలువకు 3,202, ఎస్ఎల్‌బీసీకి 1,500 క్యూసెక్కులు విడుదల అవుతోంది. సాగర్ జలాశయం నుంచి మొత్తం 8,906 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 1,16,833 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

కందులు కొనుగోలు చేయండి



నరసరావుపేట: కందుల ధరలు తగ్గుతున్న నేపథ్యంలో జిల్లా రైతుల నుంచి కొనుగోలు చేయాలని దాల్ మిల్లర్లను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. గురువారం కలెక్టరేట్‌లో దాల్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. వినుకొండ, దాచేపల్లి మండలాల్లో రైతుల వద్ద ఉన్న కందులను మెరుగైన ధరకు కొనాలన్నారు. ఈ వారంలోగా ధరను మిల్లర్స్ అసోసియేషన్ ద్వారా నిర్ణయించి కొనుగోళ్లు ప్రారంభించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా వ్యవసాయ అధికారి జె.జగ్గారావు, ఆర్డీవోలు కె.మధులత, రమణాకాంత్‌రెడ్డి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు బకాయిల చెల్లింపు పూర్తి

నరసరావుపేట: జిల్లాలో గురువారం ధాన్యం కొనుగోలు బకాయిల్లో రూ.6.29 కోట్లు చెల్లింపులు ప్రధాన కార్యాలయ నుంచి రైతుల అకౌంట్లకు జమ చేశామని, దీంతో మొత్తం బకాయిలు రూ.11.36 కోట్ల చెల్లింపులు పూర్తి చేసినట్లు జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే వెల్లడించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 2024–25 రబీ సీజన్‌లో 68 రైతు సేవా కేంద్రాల ఆధ్వర్యంలో 37 కొనుగోలు కేంద్రాల ద్వారా 550 మంది రైతుల నుంచి రూ.11.36 కోట్ల విలువైన 4,904 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. ఈ ఏడాది జూన్ 30 వరకు రూ.4.07 కోట్లు చెల్లింపులు జరిగాయన్నారు. జూలై ఒకటో తేదీన మరో రూ. కోటి రైతుల అకౌంట్లకు వేశామన్నారు.

నాణ్యతతో కూడిన విద్యుత్ సరఫరాకు చర్యలు

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి



నరసరావుపేట: నాణ్యతతో కూడిన విద్యుత్ సరఫరా చేసేందుకు తగిన చర్యలు చేపట్టినట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ డి.పుల్లారెడ్డి చెప్పారు. గురువారం ఆయన బరంపేట విద్యుత్ కార్యాలయంలో పల్నాడు జిల్లా సర్కిళ్లపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆర్‌డీఎస్ఎస్ పనులు, రెవెన్యూ కలెక్షన్లు పెంపుదల, పీఎం సూర్య ఘర్‌లపై సమీక్ష చేసి లక్ష్యాలు నిర్దేశించామన్నారు. వ్యవసాయ పంపు సెంట్ల కనెక్షన్ల కోసం రెండు వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వచ్చే మూడు నెలల వ్యవధిలో రైతులందరికి ఆ సర్వీసులు అందజేయాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. లో ఓల్టేజ్, అధిక లోడులు ఉన్న ప్రాంతాల్లో బేస్ మెంట్లు వేసి అధిక ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు జిల్లా విద్యుత్ శాఖాధికారి పి.విజయకుమార్, ఈఈ సీహెచ్ రాంబొట్లు పాల్గొన్నారు.

చూపు.. పామాయిల్ వైపు..

కేంద్రం ప్రోత్సాహంతో జిల్లాలో పెరుగుతున్న సాగు విస్తీర్ణం

పల్నాడు రైతులకు రెండేళ్లుగా వరుస నష్టాలు ఎదురవుతున్నాయి. సాధారణంగా అధికంగా పండించే మిర్చి సాగు చేసినా అప్పుల పాలవుతున్నారు. పత్తి పంటకు చీడపీడల దెబ్బకు గిట్టుబాటు కావడం లేదు. పొగాకు కొనేవారు కూడా కరువయ్యారు. ఈ నేపథ్యంలో మెట్ట రైతులు పామాయిల్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఉద్యాన శాఖ ప్రోత్సాహంతో ఇప్పటికే జిల్లా రైతులు పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు.



బెల్లంకొండ మండలం మన్నెసుల్తాన్‌పాలెం గ్రామంలో సాగులో పామాయిల్ తోట

- తొలుత 8 మండలాల్లో మొదలైన మొక్కల పెంపకం
- ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 1,408 ఎకరాల్లో తోటలు
- ఈ ఏడాది సాగు లక్ష్యం 3,300 ఎకరాలు
- ఉచితంగా మొక్కల పంపిణీ.. డ్రిప్, అంతర పంటలకు సబ్సిడీ
- సాధారణ పంటలకు ప్రత్యామ్నాయం అంటున్న ఉద్యాన శాఖ అధికారులు

సాక్షి, నరసరావుపేట: ఇప్పటివరకు పామాయిల్ తోటలంటే పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కృష్ణా జిల్లాలే గుర్తుకొస్తాయి. రెండు, మూడేళ్లుగా పల్నాడు జిల్లాలోనూ ఈ సాగు క్రమంగా పెరుగుతోంది. అనుకూల వాతావరణం, భూసారం, నీటి లభ్యత వంటి అంశాలపై ఉద్యాన శాఖ చేసిన సర్వేలో 8 మండలాలు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించారు. ఇందులో పిడుగురాళ్ల, అమరావతి, రాజుపాలెం, బెల్లంకొండ, నాదెండ్ల, ఈపూరు, మాచవరం, సత్తెనపల్లి మండలాలు ఉన్నాయి. పామాయిల్ గెలలను నేరుగా తోటలోనే కొనుగోలు చేస్తారు. వ్యాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ సంస్థకు ఆరు మండలాలు, గోద్రెజ్ ఆగ్రోవేట్ సంస్థకు రెండు మండలాలు కేటాయించారు. ఈ రెండు సంస్థలు రైతులకు మెలకువలు నేర్పడంతోపాటు మద్దతు ధరకే పామాయిల్ కొనుగోలు చేస్తున్నాయి.

అన్నివిధాలా ప్రోత్సాహం

ఈ మండలాల పరిధిలో ఇప్పటి వరకు 1,408 ఎకరాల్లో పామాయిల్ సాగు చేశారు. బెల్లంకొండ, మాచవరం, ఈపూరు మండలాల్లో అధికంగా రైతులు మొగ్గు చూపారు. ఈ ఏడాది సాగు లక్ష్యం 3,300 ఎకరాలుగా నిర్ణయించారు. పామాయిల్ దిగుమతిపై ఆధారపడకుండా రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తోంది. వంట నూనెల మిషన్ ఏర్పాటు చేసి సాగు ఉత్పత్తి పెంచేందుకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా మొక్కలను ఉచితంగా అందిస్తున్నారు. ఎకరానికి 57 మొక్కలను 9/9 మీటర్లకు ఒకటి చొప్పున నాటాల్సి ఉంటుంది. హెక్టారుకు 150 మొక్కలను ఉచితంగా అందజేస్తారు. విదేశీ రకమైతే రూ.29 వేలు, స్వదేశీ రకమైతే రూ.20 వేలు రాయితీ లభిస్తుంది. తోట నిర్వహణకు హెక్టారుకు రూ.5,250 చొప్పున నాలుగేళ్ల పాటు అందిస్తారు. అంతర్ పంటల సాగుకు మరో నాలుగేళ్లపాటు ఏడాదికి రూ.5,250 చొప్పున ఇస్తారు. బిందు సేద్యం పరికరాలను సైతం రాయితీపై తీసుకోవచ్చు. పామాయిల్ హెక్టారుకు సగటున 25 నుంచి 30 టన్నుల గెలలు దిగుబడి ఉంటుంది. టన్ను ధర సుమారుగా రూ.18 వేల వరకు ఉంటుందని రైతులు చెబుతున్నారు.

ఉచితంగా మొక్కలు పంపిణీ



జిల్లాలో పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నాం. ఎంపిక చేసిన 8 మండలాల్లో ఇప్పటికే సుమారు 564 హెక్టార్లలో సాగు అయింది. మొక్కలను ఉచితంగా అందజేస్తాం. సాగు ఖర్చులో 50 శాతం సబ్సిడీ ఉంటుంది. అంతర్ పంటల సాగుకూ రాయితీ ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తున్నాయి.

– ఇంటూరు వెంకట్రావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, పల్నాడు

ప్రత్యామ్నాయంగా పామాయిల్



గతేడాది రెండు ఎకరాల్లో పామాయిల్ సాగు ప్రారంభించాను. ఉద్యాన శాఖ అధికారులు భూములను పరిశీలించి అనుకూలమని తేల్చారు. మిర్చి, పత్తి పంటలలో వరుస నష్టాల నేపథ్యంలో దీర్ఘకాలిక ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపాం. ఉపాధి హామీ పథకం కింద అన్నివిధాలా సహకారం లభిస్తోంది. నాలుగేళ్లపాటు అంతర్ పంటలకు వెసులుబాటు ఉండటం రైతుకు మేలు చేకూరుస్తుంది.

– ఆది కోటేశ్వరరావు, రైతు, వెంకటాయపాలెం

సంబరం... ఇంద్ర వైభవం

నయన మనోహరంగా దుర్గమ్మకు శాకంబరి అలంకారం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శాకంబరి ఉత్సవాలు మూడు రోజులపాటు వైభవంగా కొనసాగాయి. పూర్ణాహుతితో ఈ ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. శాకంబరీదేవి అలంకారంలో కొలువైన దుర్గమ్మను దర్శించుకునేందుకు గురువారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మను నయన మనోహరంగా వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు.



ఉత్సవాలు పరిసమాప్తం

శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో మూడు రోజులపాటు జరిగిన శాకంబరి ఉత్సవాలు పూర్ణాహుతితో పరిసమాప్తమయ్యాయి. ఆలయ ప్రాంగణంలోని నూతన యాగశాలలో గురువారం ఉదయం ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో అర్చకులు, వేద పండితులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ఈవో శీనానాయక్ దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తన పుట్టిన రోజును పురస్కరించుకుని ఈఓ అన్నదానం పథకానికి రూ. 50 వేల విరాళం సమర్పించారు. ఉత్సవాలలో మూడో రోజున అమ్మవారి మూల విరాట్‌ను వివిధ ఫలాలు, డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. ఆలయాన్ని బత్తాయి, దానిమ్మ, పైనాపిల్, పచ్చి ఖర్జూరం, ఆల్‌బక్రా, యాపిల్, పుచ్చకాయలు, పలు రకాల ద్రాక్షలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. మూడు రోజుల ఉత్సవాల్లో 36 టన్నులకు పైగా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను వినియోగించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

అమ్మ సన్నిధిలో గురుపూజా మహోత్సవం

వ్యాస పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గురు పూజా మహోత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానానికి చెందిన తంగిరాల వెంకటేశధ్వర ఘనాపాటి, శంకరమంచి శివప్రసాద్, అహితాగ్ని గుంటూరు రామచంద్ర సోమయాజులు దంపతులను సత్కరించి పట్టువస్త్రాలు, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ ఈఓ శీనానాయక్ దంపతులు గురువులకు హారతులిచ్చి పూజ నిర్వహించారు. నగదు బహుమతి ఇచ్చి సత్కరించారు.



భక్తులతో కిటకిటలాడుతున్న అంతరాలయం

కొలిక్కిరాని బది‘లీలలు’

- జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద వెల్ఫేర్ సెక్రటరీల పడిగాపులు
- సుదూరంగా ఉన్న సచివాలయాలకు బదిలీ చేయడంపై ఆవేదన
- రివైజ్ చేసి ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతున్న సెక్రటరీలు



నెలల చిన్నారితో గుంటూరు జిల్లా ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయానికి వచ్చిన ఓ ఉద్యోగిని

నెహ్రూనగర్: ఉమ్మడి జిల్లా రూరల్ పరిధిలో పని చేసే గ్రామ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ సెక్రటరీల బదిలీల ప్రక్రియ ఇంకా కొలిక్కి రాలేదు. సొంత మండలంలో పని చేయకూడదనే ప్రభుత్వ ఉత్తర్వులను ఆధారం చేసుకుని అధికారులు ఇష్టానుసారంగా బదిలీలు చేశారు. ఈ నెల 7న వెలువడిన ఉత్తర్వులు చూసి సెక్రటరీలు కంగుతిన్నారు. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న సచివాలయాలకు బదిలీ చేయడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి గుంటూరులో 874 మంది వెల్ఫేర్ సెక్రటరీలు ఉన్నారు. వీరికి కౌన్సెలింగ్ నిర్వహించకుండానే వెబ్ ఆప్షన్స్(గూగుల్ ఫాం) ఇచ్చి బదిలీల ప్రక్రియను అస్తవ్యస్తంగా నిర్వహించారు. చాలా మందిని ప్రస్తుత సచివాలయం నుంచి వంద కిలో మీటర్ల దూరంలో ఉన్న సచివాలయానికి బదిలీ చేశారు. దీంతో ప్రతిరోజూ వందల మంది సచివాలయ సెక్రటరీలు గుంటూరు నగరంలోని ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయానికి వస్తున్నారు. తమను అంత దూరానికి బదిలీ చేస్తే ఏ విధంగా వెళతామంటూ అధికారులను వేడుకొంటున్నారు. దయతలిచి సొంత మండలం పక్కనే ఉన్న మండలంలోకి మార్చాలంటూ విన్నవించుకుంటున్నారు.

ముడుపులకే ప్రాధాన్యం

నిబంధనల ప్రకారం స్పౌజ్ కేటగిరికి ప్రాధాన్యత ఇవ్వాలి. అయితే, అధికారులు దాన్ని పక్కన పెట్టారు. ముడుపులు తీసుకుని కొందరికి నచ్చిన స్థానంలో పోస్టింగ్ ఇచ్చారు. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో పనిచేసే సెక్రటరీలకు బదిలీల ప్రక్రియ భారంగా మారింది. ప్రతి రోజు అక్కడ నుంచి గుంటూరు జిల్లా ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, న్యాయబద్ధంగా బదిలీల ప్రక్రియ జరపాలని కోరుతున్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి



గ్రీన్ పాస్‌పోర్టు అందుకున్న విద్యార్థినులతో కలెక్టర్ అరుణ్‌బాబు, డీఈఓ, ఆర్డీఓ తదితరులు

- పిల్లల చదువుపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ముఖ్యం
- పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

సత్తెనపల్లి: క్రమశిక్షణతో ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన 'మెగా పీటీఎం 2.ఓ'లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. చదువుతోనే ఉన్నత స్థానాలకు చేరుకోగలమని పేర్కొన్నారు. కష్టంగా కాకుండా ఇష్టంతో చదవాలన్నారు. తద్వారా తల్లిదండ్రులకు పేరు తేవాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. పిల్లల చదువు తీరు గురించి తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని తెలిపారు. అమ్మ పేరుతో మొక్క నాటడమే కాకుండా దానిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డీఈవో ఎల్.చంద్రకళ, సత్తెనపల్లి ఆర్డీఓ జీవీ రమణాకాంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్‌లు కూడా మాట్లాడారు. తల్లిదండ్రుల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థులకు పోటీలు పెట్టారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మొక్కలు నాటిన విద్యార్థినులకు మొక్కలతోపాటు గ్రీన్ పాస్‌పోర్టు అందించారు. తల్లులకు చిన్నారులు పాదాభివందనం చేశారు. మొక్కలు పెంచుతామని ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. మండల విద్యాశాఖాధికారి–2 ఎ.రాఘవేంద్రరావు, ప్రధానోపాధ్యాయురాలు మాధవీ లత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.





వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మోదుగుల, వేదికపై డాక్టర్ పూనూరి, డాక్టర్ గోపిరెడ్డి, బొల్లా తదితరులు

అన్ని వర్గాలను ముంచేసిన బాబు

- సీఎం మోసాన్ని ప్రతి ఇంటికెళ్లి వివరించండి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ముఖ్య నేతల పిలుపు
- జిల్లా పార్టీ కార్యాలయంలో విస్తృతస్థాయి సమావేశం
- నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం
- అందరూ కలిసికట్టుగా ఉండాలని సూచన
- కేసులకు భయపడొద్దని, అండగా ఉంటామని భరోసా

నరసరావుపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రతి ఇంటికి, ముఖ్యంగా మహిళలకు వివరించాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందని ముఖ్య నేతలు పేర్కొన్నారు. అన్నివర్గాలను చంద్రబాబు నిండా ముంచేశారని మండిపడ్డారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ, రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో అనే కార్యక్రమం గురించి శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. దీనికి పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎన్టీఆర్ జిల్లా పరిశీలకులు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, పల్నాడు జిల్లా పరిశీలకులు డాక్టర్ పూనూరి గౌతంరెడ్డి, వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హాజరయ్యారు. నాయకులకు, కార్యకర్తలకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షులు ఎస్.సురేంద్ర, అచ్చి శివకోటి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల సాంబశివారెడ్డి, సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి మాస్టారు, ఇంటలెక్చ్యువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఇయంస్వామి, జిల్లా కార్యదర్శి ఎస్.సుజాతాపాల్, అంగన్ వాడీ విభాగ రాష్ట్ర కార్యదర్శి హెల్డా ఫ్లోరెన్స్, గిరిజన, మాదిగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు పాలపర్తి వెంకటేశ్వరరావు, కందుల ఎజ్రా, రొంపిచర్ల మండల ఉపాధ్యక్షులు పచ్చవ రవీంద్ర, యువజన విభాగ నాయకుడు ఎస్కే ఆంజనేయులు కూడా మాట్లాడారు. జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, పంచాయతీ విభాగ రాష్ట్ర కార్యదర్శి పడాల చక్రారెడ్డి, రైతు విభాగ జిల్లా అధ్యక్షులు అన్నెం పున్నారెడ్డి, యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్, మున్సిపల్ విభాగ జిల్లా అధ్యక్షుడు షేక్ రెహమాన్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శనివారపు వాసుదేవరెడ్డి, అధికార స్పోక్ పర్సన్ ఆర్.శ్రీనివాసరావు, మద్దిరెడ్డి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి పెరుగుతున్న ఆదరణ



మోదుగుల మాట్లాడుతూ.. వైఎస్ జగన్ పర్యటనలు మొదలుపెట్టే వరకు ఒక మాజీ ఎంపీగా పోలీసు అధికారులకు ఫోన్ చేసినా తనను లెక్క చేయలేదని గుర్తు చేశారు. అయితే పొదిలి, రెంటపాళ్ల పర్యటనలతో మార్పు వచ్చిందన్నారు. ఇప్పుడు కుర్చీలు వేసి పని చేసి పెడుతున్నారని చెప్పారు. చంద్రబాబు చెప్పినట్టు డబ్బులు ఇవ్వలేదనే విషయం ప్రతి మహిళకు తెలియజేయాలన్నారు. కూటమి నాయకులు ఎక్కడా తిరగలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. చంద్రబాబు మోసాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వివరించాలని సూచించారు. డాక్టర్ గోపిరెడ్డికి కార్యకర్తలు అండగా నిలబడాలని సూచించారు.

ఆందోళనతోనే ‘తల్లికి వందనం’



కార్యక్రమంలో డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ తనకు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్ష పదవి నియోజకవర్గంలోని కార్యకర్తలను చూసి ఇచ్చారని అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఏడు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపొందేలా ఉత్సాహంగా పనిచేయాలని కోరారు. పార్టీ కోసం పనిచేసే వారిని గుర్తుపెట్టుకుంటామని హామీ ఇచ్చారు. కేసులకు ఎవరూ భయపడాల్సిన పనిలేదని.. అవసరమైతే పార్టీ కోసం జైలుకు వెళతానని అన్నారు. వెన్నుపోటు దినం పాటించటం వలనే చంద్రబాబు తల్లికి వందనం కొంతవరకు అమలు చేశారని పేర్కొన్నారు. ఇతర హామీలు అమలు కాని తీరును ప్రజలకు వివరించాలన్నారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ బాబు



పూనూరి గౌతంరెడ్డి మాట్లాడుతూ... మోసానికి బ్రాండ్ అంబాసిడర్‌గా చంద్రబాబు పాలిస్తున్నారని మండిపడ్డారు. రూ.5.60 లక్షల కోట్లు ఖర్చుచేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులతో ఏం చేసిందో అర్థం కావట్లేదన్నారు. చంద్రబాబు చెప్పుకొనేందుకు తనకంటూ ఒక్క పథకమైనా లేదని పేర్కొన్నారు. వైఎస్ జగన్ ఏది చెబితే అదే చేస్తారనే నమ్మకం ప్రజలలో ఉందన్నారు. పార్టీ సూచించిన ప్రకారం క్యూఆర్ కోడ్ ఉపయోగించుకుని ప్రతి ఇంటికి వెళ్లి బాబు మోసాలు ప్రజలకు తెలియచేయాలని కార్యకర్తలకు సూచించారు. భవిష్యత్‌లో కార్యకర్తలకే ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. కేసులకు భయపడొద్దన్నారు.

నమ్మి మోసపోయిన ప్రజలు



వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ.. చంద్రబాబు మోసం చేస్తాడని తెలిసినా ఏదో ఒక ఆశతో ఓట్లేసి ప్రజలు మళ్లీ అధికారం అప్పగించారని అన్నారు. గత ఎన్నికల్లో ఓడింది తామే కాదని, కార్యకర్తలు కూడా అనే విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు చేసిన మోసం గురించి తెలియజెప్పాలని కోరారు. టీడీపీ వారు చిన్న పని చేసి కొండంత ప్రచారం చేసుకుంటారని అన్నారు. మనం కూడా మారాలన్నారు. లెక్కలు కచ్చితంగా రాసుకొని తిరిగి అంతకు అంత ఇస్తామని హెచ్చరించారు. కేసులకు భయపడకుండా అందరూ ఐక్యంగా పనిచేయాలని సూచించారు.



పసుపు ధరలు
(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 743

కొమ్ములు : 541 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,100	10,725	10,100

కాయలు : 202 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,100	10,100	10,100

మొత్తం అమ్మకాలు : 557.250 క్వింటాళ్లు

–దుగ్గిరాల

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 1,000 గరిష్టం : రూ. 1,600

మోడల్ ధర రూ. 1,200

మిర్చి యార్డు సమాచారం
(గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	41,480
అమ్మకాలు	44,205
నిల్వ	7,114

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–12,800
నంబరు-5	10,000–13,300
341	10,000–13,400

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–12,800
నంబరు-5	10,000–13,200
273	9,800–12,400
341	10,000–13,500
4884	10,000–12,600

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 13,500
బాడిగ-355	10,000 – 12,600
దేవనూరు డీలక్స్	10,000 – 12,400
ఆర్మూర్	9,600 – 11,200
తాలుకాయలు	5,000 – 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–13,400
బాడిగ – 355	10,000–12,500
తాలు	5,200 – 7,000

–కొరిటెపాడు (గుంటూరు)

అభివృద్ధిపై చర్చకు వచ్చే దమ్ముందా?

- ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో తేల్చుకుందామని టీడీపీ నేతలకు సవాల్
- చంద్రబాబు మోసాలను ఇంటింటికి చాటుదాం
- వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకులు పూనూరు గౌతమ్ రెడ్డి



మాట్లాడుతున్న పూనూరు గౌతమ్‌రెడ్డి, పక్కన డాక్టర్ సుధీర్ భార్గవ్ రెడ్డి, నాయకులు

సత్తెనపల్లి: ఎవరి హయాంలో, ఏ విధమైన అభివృద్ధి జరిగిందో చర్చకి వచ్చే దమ్ము చంద్రబాబు, అండ్ కోకు ఉంటే తన సవాల్‌ను స్వీకరించాలని వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంటు పరిశీలకులు పూనూరు గౌతంరెడ్డి అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి లోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుచేస్తూ .. నిర్వహించిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి అధ్యక్షత వహించారు. పూనూరు గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఐదేళ్లలో ఏం అభివృద్ధి జరిగిందో, చంద్రబాబు 21 ఏళ్లలో ఏం అభివృద్ధి జరిగిందో చర్చకు వస్తే సత్తెనపల్లి వేదికగా తేల్చుకుందామని, ఈ సవాల్‌ను చంద్ర బాబు, అండ్ కో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరైనా నెల రోజుల్లోపు స్వీకరించవచ్చన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాది అయిందని పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. వందలాది మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలను హతమార్చడం, వేలాది మందిని క్షతగాత్రులు చేయడం తప్ప మరొకటి లేదన్నారు. మీరు పెట్టే అక్రమకేసులకు, లాఠీలకు, తూటాలకు భయపడేది లేదన్నారు.

స్మార్ట్ మీటర్ల పేరుతో రూ. 23 లక్షల కోట్ల భారం

వైఎస్సార్ సీపీ శ్రేణులంతా కలిసికట్టుగా ఐకమత్యంతో పని చేయాలని, అప్పుడే ఎలాంటి అక్రమ కేసులైనా ఎదుర్కోవచ్చునన్నారు. పల్నాడు జిల్లాలో పార్టీకి పట్టుకొమ్మ లాంటిది సత్తెనపల్లి నియోజకవర్గమన్నారు. వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే బలమన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో రూ. 23 లక్షల కోట్ల భారం ప్రజలపై చంద్రబాబు వేయనున్నారన్నారు. నాడు వైఎస్ జగన్ యూనిట్ రూ. 2కు విద్యుత్ కొనుగోలు చేస్తే పెడబొబ్బలు పెట్టిన చంద్రబాబు, ఎల్లో మీడియా ఇప్పుడు యూనిట్ రూ. 4.75 కొంటుంటే మౌనంగా ఉంటున్నారన్నారు. జగన్ హయాంలో 1.35 లక్షల పర్మినెంట్ ఉద్యోగాలు, 4 లక్షల వలంటరీ ఉద్యోగాలు ఇస్తే.. చంద్రబాబు ఏపీ ఫైబర్‌లో 1200 మందిని, ఏపీ బేవరేజెస్‌లో 18 వేల మందిని, 4 లక్షల వలంటీర్లను తొలగించాడన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను ఇంటింటికీ తెలియజేయవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, పట్టణంలో పర్యటించి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ .. మోసాలు వివరిద్దమన్నారు.

ఇంటింటికి చంద్రబాబు మోసాలు

నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలకు పేర్లు మారుస్తూ చంద్రబాబు కోతలు విధిస్తున్నాడన్నారు. దివ్యాంగుల పెన్షన్లకు వెరిఫికేషన్ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. చంద్రబాబు ఒక్క వాగ్దానాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. చంద్రబాబు మేనిఫెస్టోను ఇంటింటికి వివరించాల్సిన అవసరం ఉందన్నారు. రెంటపాళ్ళ జగన్ పర్యటనను ఎలా విజయవంతం చేశామో అదే ఊపు, ఉత్సాహంతో మరో మూడేళ్లు పని చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పక్కాల సూరిబాబు, డాక్టర్ గీతా హసంతి, రోళ్ల మాధవి, చలంచర్ల సాంబశివరావు, గంగారపు అనూష, రాజవ రపు శివ నాగేశ్వర రావు, రాయపాటి పురుషోత్తమరావు, నక్కా శ్రీను, వేపూరి శ్రీనివాసరావు, భవనం రాఘవరెడ్డి, మర్రి సుబ్బారెడ్డి, ఎంజేఎం రామలింగారెడ్డి లు మాట్లాడారు. సమావేశంలో నాయకులు రమావత్ కోటేశ్వరరావు నాయక్, ముక్తార్, సయ్యద్ ఘోర, షేక్ జలీల్, అచ్యుత శివ ప్రసాద్, తుమ్మల వెంకటేశ్వరరావు, చిలుక జైపాల్, లోకా మాధవ, గడ్డం వెంకటేశ్వర్లు, వాకు మళ్ళ చెంచిరెడ్డి, చిన్నం మణి బాబు తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియంలలోని కార్మికులను కొనసాగించాలి

అమరావతి: రాష్ట్రంలోని అమరావతి సర్కిల్ పరిధిలోగల ఏఎస్ఐ మ్యూజియాల్లో క్యాజువల్ లేబర్‌గా విధులు నిర్వర్తిస్తున్న 150 మందిని కొనసాగించాలని, గురువారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించామని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు తెలిపారు. ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి మహాచైత్యం, నాగార్జునకొండ మహాచైత్యం, గండికోట, లేపాక్షి, చంద్రగిరి పోర్ట్, శాలిగుండం, భట్టిప్రోలు, శంకరం ఏఎస్ఐ మ్యూజియంలలో 10,15 సంవత్సరాలుగా పని చేస్తున్న క్యాజువల్ కార్మికులను ఎలాంటి రాతపూర్వక ఉత్తర్వులు లేకుండా విధులకు హాజరు కావద్దని మౌఖిక ఆదేశాలు జారీచేయటం దారుణమన్నారు. ఈచర్యవల్ల దాదాపు 150 కుటుంబాలు ఉన్నఫలంగా రోడ్డున పడ్డారన్నారు. గతంలో ఈ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని నివేదిక ప్రస్తుతం డైరెక్టర్ జనరల్ ఆఫీస్‌లో చాలాకాలంగా పెండింగ్‌లో ఉందన్నారు. ప్రస్తుతం క్యాజువల్ లేబర్ పనిచేస్తున్న వారందరినీ కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ఆధ్వర్యంలో గురువారం ప్రధానమంత్రి కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. ఆయన వెంట ఉద్యోగుల ప్రతినిధులు గద్దం అమృత్ కుమార్, తెలగంశెట్టి చూడామణి, కందుల రమేష్ ఉన్నారు

తుల్జాభవానీ దేవాలయ పునర్నిర్మాణానికి కార్యాచరణ



పుట్లగూడెం అడవిలో సర్వే నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

అచ్చంపేట: మండలంలోని పుట్లగూడెం నుంచి బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం వరకు అడవిలోనుంచి నాలుగున్నర మీటర్ల వెడల్పుగల రోడ్డు, ఇటీవల కూల్చివేతకు గురైన తుల్జాభవానీ దేవాలయ పునర్నిర్మాణాలకు అటవీ శాఖాధికారులు గురువారం కార్యాచరణ ప్రారంభించారు. వీటి సాధనకోసం తాము ఢిల్లీ వరకు వెళ్లి ఫారెస్ట్ కన్జర్వేటివ్ అధికారులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయని అఖిలభారత గిరిజన వికాస పరిషత్ అధ్యక్షుడు భూక్యా తులసినాయక్ (బీటీ నాయక్), కార్యదర్శి భూక్యా రమేష్ నాయకులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బ్రిటీష్ కాలంలో ఉన్న నాలుగున్నర మీటర్ల వెడల్పుగల రోడ్డు నిర్మాణానికి, అడవి మధ్యలో ఉన్న తమ ఆరాధ్య దేవత తుల్జా భవానీ అమ్మవారి దేవాలయ నిర్మాణానికి కావలసిన భూమి కేటాయింపునకు అధికారులు సర్వే నిర్వహించారన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే అచ్చంపేట, బెల్లంకొండ మండలాల మధ్య దూరం తగ్గి రాకపోకలకు అనువుగా ఉంటుందని తెలిపారు. ఫారెస్ట్ అధికారులు పాత రికార్డులు, శాటిలైట్ పిక్చర్స్ పరిశీలించి బాట ఉన్న విషయాన్ని రూఢి చేసుకున్నారన్నారు. అదేవిధంగా అమ్మవారి దేవాలయానికి అనువైన స్థలం కోసం అన్వేషించారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెస్సర్స్ మరోని ఇన్‌ఫ్రా సంస్థ మేనేజర్ జి.బాలాజీ, సివిల్ ఇంజినీర్ డి.నాగరాజు, నరసరావుపేట ఫారెస్ట్ రేంజర్ అధికారి అడవిలో అనువైన స్థలాలను పరిశీలించారన్నారు. దేవాలయ కమిటీ సభ్యులు, వెంకటాయపాలెం సర్పంచ్ భూక్యా నాగమ్మ, మాజీ సర్పంచ్ మేకం శ్రీరామమూర్తి, హన్మంత్ నాయక్, ఆర్యవైశ్య నాయకులు దేవరశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి రూ.5 లక్షలు సాయం



చెక్కు అందజేస్తున్న అదనపు ఎస్పీ జేవీ సంతోష్

నరసరావుపేట రూరల్: అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు కుటుంబానికి తోటి హోంగార్డులు అండగా నిలిచారు. మృతుని కుటుంబానికి ఒక రోజు వేతన మొత్తం రూ.5 లక్షలను సాయంగా అందించారు. తెనాలి రూరల్ పీఎస్‌లో విధులు నిర్వహిస్తూ హోంగార్డు వై.శ్రీనివాస్ ఈ ఏడాది ఫిబ్రవరి 18వ తేదీన గుండెపోటుతో మృతిచెందాడు. హోంగార్డు కుటుంబానికి అండగా నిలిచేందుకు తోటి హోంగార్డులు ముందుకు వచ్చారు. ఒక రోజు వేతనాన్ని సాయంగా అందించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం జిల్లా అదనపు ఎస్పీ జేవీ సంతోష్ చేతుల మీదగా శ్రీనివాస్ కుటుంబసభ్యులకు సాయం చెక్‌ను అందజేశారు. హోంగార్డు కుటుంబానికి సాయం చేసేందుకు ముందుకు వచ్చని జిల్లా హోంగార్డులను అదనపు ఎస్పీ అభినందించారు. అలాగే హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ గుండెపోటు కారణంగా ఉద్యోగ విరమణ చేసిన బండ్లమోటు పిఎస్ హోంగార్డు ఎ.నాసరయ్యకు రూ.5 లక్షల చెక్‌ను అదనపు ఎస్పీ సంతోష్ అందించారు.

ఇష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు..

- జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు
- లింగంగుంట్ల శంకర భారతీపురం హైస్కూల్‌లో మెగా పేరెంట్స్ మీటింగ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: పాఠశాలను దేవాలయంగా భావించి క్రమశిక్షణతో ఇష్టపడి చదివితే ఎంచుకున్న రంగంలో రాణించవచ్చని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.పార్వతి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సృజనాత్మకతతో ఎదిగేందుకు అనువైన వాతావరణం ఉంటుందని తెలిపారు. విద్యార్థుల బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులపై ఉందన్నారు. తమ పిల్లల దినచర్యపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. పిల్లల ఆసక్తిని గమనించి ఆయా రంగాల్లో వారిని ప్రోత్సహించాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు, అడిషనల్ ఎస్పీ సంతోష్, ఆర్‌డీఓ మధులత, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఎంపీడీఓ టీవీ కృష్ణకుమారి, విద్యాకమిటీ చైర్మన్ ఎం.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 10వ తరగతి ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రిటైర్డ్ హెచ్‌ఎం ఎంఎస్ఆర్‌కే ప్రసాద్ నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.

యూనిఫాం లేక.. సాధారణ దుస్తులతోనే రాక...



వేసవి సెలవుల అనంతరం పాఠశాల ప్రారంభించే నాటికి విద్యార్థులందరికీ యూనిఫాంలు అందజేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించినా.. ఆచరణలో మాత్రం విఫలమైంది. పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్‌కు విద్యార్థులు సాధారణ దుస్తులతో హాజరయ్యారు. పాఠశాలలో మొత్తం 1225మంది విద్యార్థులు ఉండగా, వీరికి యూనిఫామ్ అందకపోవడంతో వారందరూ సాధారణ దుస్తులతోనే సమావేశానికి హాజరవడం గమనార్హం. తొలుత ఈ పాఠశాలలోని తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు హాజరవుతారని కలెక్టర్ కార్యాలయం ప్రకటించింది. అయితే విద్యార్థులకు యూనిఫామ్ లేకపోవడంతో జిల్లా కలెక్టర్ గైర్హాజరయ్యారని తల్లిదండ్రులు చర్చించుకున్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై పోలీసుల జులుం

- అర్ధరాత్రి స్టేషనుకు పిలిపించి తమదైన శైలిలో కౌన్సెలింగ్
- సోషల్‌మీడియాలో పోస్టు పెట్టాడనే నెపంతో దారుణం
- ఖండించిన మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై రెడ్‌బుక్ చర్యలు ఆగడంలేదు. పోలీసుల సహాయ సహకారాలతో వేధింపుల పర్వం కొనసాగుతోంది. తాజాగా ఈపూరు మండలం ఇనిమెళ్ల గ్రామానికి చెందిన రామినీడి అనీల్ అనే వైఎస్సార్ సీపీ కార్యకర్తపై ఈపూరు పోలీసులు తమ ప్రతాపం చూపారు. గురువారం స్టేషనకు పిలిపించి అర్ధరాత్రి వరకు తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇంతకు అనీల్‌చేసిన నేరమేమిటంటే.. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ టీవీ కార్యాలయంపై కొందరు దాడి చేయడంపై.. అనీల్ సోషల్ మీడియాలో స్పందించడమే.. సాక్షి మీడియాపై కూడా రాష్ట్రంలో దాడులు జరగలేదా..? అని పోస్టు పెట్టడమే కారణం. దీనిని గమనించిన స్థానిక టీడీపీ నాయకులు పోలీసుల సాయంతో అనీల్‌ను స్టేషనుకు పిలిపించి కౌన్సెలింగ్ ఇప్పించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు అనీల్ కోసం స్టేషన్‌కు వెళ్లగా వారిని చూసి పోలీసులు అనీల్‌ను వదలిపెట్టడం గమనార్హం.

- తాము చెప్పినట్లు నడుచుకోకపోతే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించినట్లు బాధితుడు తెలిపారు. సోషల్ మీడియాలో పోస్టు తొలగించినప్పటికీ కనికరంలేకుండా పోలీసులు క్రూరంగా తనను హింసించినట్లు తెలిపాడు. పోలీసులే ఇలాంటి చర్యలకు పాల్పడితే న్యాయం కోసం ఇంక ఎక్కడి వెళ్లాలని వాపోయాడు.
- అనీల్‌పై దాడిని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తీవ్రంగా ఖండించారు. గ్రామాల్లో రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో కార్యకర్తలను వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఈపూరు పోలీసులపై ఫిర్యాదు చేశారు. కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసాఇచ్చారు. న్యాయపరమైన పోరాటం చేసి కార్యకర్తలను కాపాడుకుంటామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ అమరావతిరోడ్డు లాడ్జి సెంటర్ దగ్గర విజయ హాస్పిటల్ వెనుకవైపు దక్షిణం ముఖం 111 గజాల ఇల్లు అమ్మకానికి కలదు. గజం 1,60,000. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 9885480819

TO-LET

■ లాడ్జి/హాస్టల్స్ కు అరండల్‌పేట 5/3,పాల్స్ వెనుక,శ్రీ సాయి హాస్పిటల్స్ ఎదురు, పాత శ్రీనివాస లాడ్జి, 1,2 ఫ్లోర్లు 11 రూములు అన్ని సౌకర్యములతో అద్దెకు.సంప్ర: 9490723929

SERVICES

BUSINESS OFFER

■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి :7406393937

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 8142282071

■ బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) సంప్ర: 87907 41166

HEALTH CARE

■ మీ ఇంట్లో నుంచే అధిక బరువును (లావు)తగ్గించుకోండి/ పెంచుకోండి చాలా సులభంగా, సురక్షితంగా శాస్త్రీయంగా మీ శరీరానికి కావలసిన సమతుల్యమైన ఆహారం లభించును. 90147 56524

OLD AGE HOME

■ సుబ్రహ్మణ్య హోమ్ కేర్ సర్వీసెస్ ఇంటిపని వంటపని బెడ్ పేషెంట్స్‌ను చూసుకొనుటకు అనుభవం గల వర్కర్స్ మీ ఇంటి వద్దకే పంపబడును. 9846635365

WANTED

■ వేదం ఓల్డేజ్ హోమ్ వృద్ధులను సేవ చేయుటకు అనుభవం కలిగిన వర్కర్ వంటమనిషి కావలెను. భార్యాభర్తలు. 7780791297, 9642791297

■ గాయత్రి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు GNM, BSC నర్సులు, MLT ల్యాబ్ టెక్నీషియన్స్, రిసెప్షనిస్ట్‌లు, PROలు కావలెను. ఓల్డ్ క్లబ్ రోడ్, కొత్తపేట, గుంటూరు. 8008999100, 08632223132

■ ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ గుంటూరు నందు పనిచేయుటకు ఇంటర్ విద్యార్హతతో వివాహిత స్త్రీలకు మార్కెటింగ్ మరియు ఆఫీస్ జాబ్ చేయుటకు పోస్టులు కలవు. 75694 78729

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

గురజాల: అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్‌ను అరెస్టు చేసినట్లు గురజాల డీఎస్పీ బి.జగదీష్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీన మంచికల్లు గ్రామానికి చెందిన బొల్లెద్దుల కోటేశ్వరరావు దంపతులు గురజాల బైపాస్ మీదుగా దాచేపల్లికి వెళ్తుండగా మార్గం మధ్యలో జగనన్న కాలనీ వద్ద మహిళ మెడలోని నాన్‌తాడును అపహరణకు గురైందన్నారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో దంపతులు ఫిర్యాదు చేశారన్నారు. కేసు విచారణలో సీఐ ఆవుల భాస్కర్ టీంను ఏర్పాటు చేసి విచారణ సాగించారని, పలు సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించగా విచారణలో నిందితుడు తెలంగాణ రాష్ట్రం, సూర్యపేట జిల్లా, కోదాడ మండలం బాలాజీ నగర్ తండాకు చెందిన బర్మవత్ నాగరాజుగా గుర్తించారు. నాగరాజును విచారించగా చైన్ స్నాచింగ్‌ను ఒప్పుకోవడం జరిగిందన్నారు. అతని వద్ద సుమారుగా రూ.10 లక్షలు విలువ కలిగిన 92 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాగరాజు డీజే ఆపరేటర్‌గా పనిచేస్తూ చెడు వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తు జీవనం సాగిస్తుంటాడన్నారు. అతను ఫిబ్రవరి నెల 16వ తేదీన నరసరావుపేట సత్తెనపల్లి మధ్య మాదాల గ్రామం వద్ద టీవీఎస్‌పై భర్తతో కలిసి వెళ్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును, 19వ తేదీన పిడుగురాళ్ల మండలం శ్రీనివాసపురం వద్ద ఓ మహిళ మెడలో చైన్ లాక్కొని వెళ్లిపోయినట్లు విచారణలో ఒప్పుకున్నట్లు తెలిపారు. నందిగామ, గండేపల్లి, వత్సవాయి, చిల్లకల్లు, తెనాలి త్రీ టౌన్, పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు సంబంధించి పలు కేసులు ఇతనిపై ఉన్నాయన్నారు. కేసును ఛేదించిన సీఐ ఆవుల భాస్కర్, ఎస్ఐ వై.వినోద్ కుమార్, బి.అనంత కృష్ణ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రేపు జిల్లా స్విమ్మింగ్ జట్ల ఎంపికలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో సబ్ జూనియర్స్, జూనియర్స్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వాటర్ పోలో జట్టు ఎంపికలు నిర్వహిస్తామన్నారు. జిల్లా జట్లుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19, 20 తేదీలలో విశాఖపట్నం బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న 10వ అంతర్ జిల్లాల ఛాంపియన్‌షిప్ పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను ఈనెల 11వతేది సాయంత్రం 5గంటల లోపు స్విమ్మింగ్ పూల్ కార్యాలయంలో తమ ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్‌ఎం సుభాని



సత్తెనపల్లి: 12వ పీఆర్‌సీ, ఐఆర్, డీఏలు, ఎరియర్స్‌పై పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్‌ఎం సుభాని అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం చేయమన్న పనులు, ఇవ్వమన్న రిపోర్టులు క్షణాల మీద నిద్రాహారాలు మానేసి సమాయానికి ఇస్తున్నా ప్రభుత్వ ఉద్యోగస్తులకు రావలసిన 12వ పీఆర్‌సీ, ఐఆర్, డీఏలు, ఎరియర్స్ పట్ల మాత్రం మౌనంగా ఉంటున్నారని, ఇది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లను నిరాస నిస్పృహలకు గురిచేస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే వాటిని విడుదల చేయాలన్నారు.

నెలాఖారులోగా పనులు పూర్తిచేస్తాం

ఎన్నెస్పీ డీఈ విజయలక్ష్మి

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం అడ్డంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో జరుగుతున్న మేజరు కాల్వ అభివృద్ధి పనులు ఈనెలాఖారులోగా పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టినట్లు లింగంగుంట్ల ఎన్నెస్పీ డీఈ జరుగుల విజయలక్ష్మి చెప్పారు. గురువారం పొట్లూరు గ్రామానికి చెందిన లింగా రత్తమ్మ తన పొలానికి సాగునీరు ఇవ్వటం లేదని జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయగా క్షేత్రస్థాయిలో విచారణ నిమిత్తం మేజరు కాల్వను పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ శ్రీశైలం, నాగార్జునసాగర్ జలశయాలకు పూర్తిస్థాయిలో నీటి సామర్థ్యం పెరుగుతుందని, ఉన్నతాధికారుల సమావేశం అనంతరం ఏబీసీ కెనాల్‌కు సాగునీరు విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఏబీసీ కెనాల్ పరిధిలో ఉన్ననటువంటి మేజరు కాల్వలు రూ.60 లక్షల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనులను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి విధివిధానాలు అధికారులకు సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. పోట్లూరు మేజరు కాల్వ పరిధిలో నూతన సైఫన్ నిర్మాణ పనులకు రూ.30లక్షల నిధులు అంచనాలు వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. వీఆర్వో నరసింగరావు, ఎన్నెస్పీ ఏఈ పోట్లూరు లక్ష్మీనారాయణ రైతులు ఉన్నారు.

రైతు సంఘం నేతపై టీడీపీ నాయకుల దాడి

క్రోసూరు అమరావతి బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో



మీడియాతో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం సభ్యుడు తిమ్మిశెట్టి హనుమంతరావు

క్రోసూరు: కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో మండలంలోని సీజీజీబీ బ్యాంకులో గోల్డ్ బాధితులకు అండగా నిలిచిపోరాడుతున్న రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు తిమ్మిశెట్టి హనుమంతరావుపై దొడ్లేరు గ్రామానికి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్‌జాను, అతని తమ్ముడు సమీర్ దాడిచేశారని బాధితుడితో కలిసి సీపీఎం నేతలు గురువారం క్రోసూరులోని అమరావతి బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేశారు. ఈ విషయమై బాధితుడు తిమ్మిశెట్టి మీడియాతో మాట్లాడుతూ తాను దొడ్లేరు గ్రామం వెళ్తుండగా, టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్‌జాను, అతని తమ్ముడు దారికాచి దుర్భాషలాడుతూ నీకు ఇక్కడేం పని, దొడ్లేరు ఎందుకొస్తున్నావంటూ దాడిచేసి కొట్టాడని తెలిపాడు. గతంలో కూడా సాగు నీరు విషయమై వీరు తనపై దౌర్జన్యం చేసారని తెలిపారు. తనపై దాడి చేసిన వారిపై ఎఫ్ఐఆర్ కట్టి వెంటనే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నేతలతో కలిసి రాస్తారోకో చేసారు. ఆందోళన చేస్తున్న వారితో సీఐ సురేష్, ఎస్ఐ రవిబాబు మాట్లాడి విరమింపజేశారు.

నీటిగుంతలో పడి వ్యక్తి మృతి



వినుకొండ: వినుకొండ రూరల్ మండలం, గోకనకొండ గ్రామానికి చెందిన పాలపర్తి ఆంజనేయులు(45) ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి మృతిచెందాడు. ఈనెల 8వతేదీన గ్రామ సమీపంలో బహిర్భూకని వెళ్లి గ్రామ శివారులో గల పొలంలో వున్న నీటి కుంటలో పడి మృతిచెందినట్లు గుర్తించారు. మరుసటి రోజు ఉదయాన్నే బంధువులు వెతుక్కుంటూ నీటి కుంట వద్దకు వెళ్లి చూడగా శవమై తేలియాడుతున్నట్లు సమాచారం. మృతునికి భార్య ఏగేశ్వరమ్మ, కుమారుడు అనిల్, కుమార్తె అఖిల వున్నారు. వినుకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.